# అందమా కోరేది

## కె.వి.వి. సత్యనారాయణరాజు

"రూపను చూస్తే నాగుండె తరుక్కుపోతోందిరా అన్నాడు కుమార్ భరత్ ఏమీ మాట్లాడలేదు అతడికి తెలుసు – రూప పరిస్థితి ఆలోచించిన వాడి కెవడి కైనా బాధ కలిగిస్తుందని

'పెళ్ళైన మూడు నెలలకే భర్తను గోదాట్లో కలిపింద'ని అత్త వారింట్లో అన్నవాళ్ళే మళ్ళీ మళ్ళీ అన్నారు, రూపనుద్దేశించి

జాతీయ స్థాయిలో గజ ఈతగాడిగా పేరొందిన తమ కొడుకు– పడవ ప్రమాదంలో తలక్రిందులైన పడవ లోంచి నీట్లో పడి అర్థాంతరంగా అసువులు బాయడం – కోడలి మహిమగాక మరేమిటని నిలదీశారతడి తల్లి తండ్రులు, తమ నోదార్చడాని కొచ్చిన బంధు వర్గాన్ని

తండ్రి పోయాక, చెల్లెలి పెళ్ళి బాధ్యత నెత్తిన వేసుకుని, నానా గడ్డీ కరిచి సంపాదించిన సొమ్ముతో ఆమెనో ఇంటి దాన్ని చేసిన కుమార్ – బావగారి అకాల దుర్మరణ వార్త విని, చెల్లెల్ని ఇంటికి తీసుకు రావడానికని వెళ్ళి – అక్కడ తన చెల్లెలు అనుభవిస్తోన్న మానసిక వ్యధను కళ్ళారా చూసి– తట్టుకో లేక ఆ రోజే ఆమెను ఇంటికి తీసుకొచ్చేశాడు

అప్పటికే ఆ విషయం చాలా సార్లు మిత్రుడినోటి నుంచి విని ఉండడం చేత జరిగిన విషయాలన్నీ పూస గుచ్చినట్టుగా తెలుసు భరత్‌కు అతడూ నిజంగానే బాధ పడ్డాడు రూప పరిస్థితికి

మిత్రుడి మొహంలోకి చూస్తూ అన్నాడు కుమార్, మన వివాహ వ్యవస్థ అంటేనే నాకు అసహ్యం వేస్తోంది పెళ్ళి గాక ముందు పూలు పెట్టుకొని, బొట్టు ధరించే స్త్రీ, పెళ్ళయ్యాక దురదృష్ట వశాత్తూ భర్త మరణిస్తే వాటి నెందుకు వదులుకోవాలి?

మిత్రుడి మాటలు వింటోంటే, ఆరు నెలల క్రితం అదే విషయమై తమిద్దరి మధ్యా జరిగిన చర్చ గుర్తొచ్చింది భరత్‌కు కాక పోతే ఇప్పుడు కుమార్ వేసిన ప్రశ్నే అప్పుడు తను వేశాడు

పూర్వం బాల్య వివాహాలు చేయడానికీ, భర్తల్ని కోల్పోయిన స్త్రీలకు కట్టూ, బొట్టుల మీద ఆంక్షలు విదించడానికీ సంబంధముందన్నా డతడు పెళ్ళి గాక ముందు గర్భవిచ్ఛిత్తికి పాల్పడ వలసిన అవసరం అప్పటి వాళ్ళకు లేక పోవడానికి కారణం, బాల్య వివాహాలే అన్నాడు కుమార్

విదవలు అందంగా అలంకరించుకుంటే వాళ్ళను చూసి ఏ జల్సా పురుషుడో మోజు పడే అవకాశమూ, వయసు పోరు నుంచి తప్పించు కునేందు కందుకనుగుణంగా స్పందించే అవసరమూ ఉన్నాయి కాబట్టే వాళ్ళ కటువంటి ఆంక్షలు ఎధించారని, సమాజ నియమాలను సమర్థించాడు కుమార్

మిత్రుడి మాటలతో ఏకీభవించక పోయినా అతణ్ణి చిన్న బుచ్చడం ఇష్టం లేక –'ఎక్కడో అరుదుగా జరిగే అటువంటి అనాచారాలను దృష్టిలో ఉంచుకొని – భర్తను కోల్పోయిన ప్రతి స్త్రీకి అటువంటి ఆంక్షలు విధించడం ఘోరాతి ఘోర'మన్నాడు తను

అందుకు బదులుగా – ' ఎవరైనా అలంకరణ ఎందుకు చేసుకుంటారు? నలుగురికీ ఆకర్షణీయంగా కనబడాలనే కదా? అటువంటప్పుడు, భర్తను కోల్పోయిన స్త్రీ – ఇతరుల నాకర్షించే ఉద్దేశ్య మామెకు లేక పోతే, పూల మీదా, బొట్టు మీదా, రంగు రంగుల చీరల మీదా, ఇతర సౌందర్య సాదనాల మీదా అంత మోజు చూపించడ మెందుకు? అన్నాడు కుమార్,

తన భావాల నంత వన్ వేగా అతడు చెప్పినపుడు, అదే విషయం మీద తనింకా వాదించడంలో అర్థం లేదనిపించి ఆ ప్రస్తావన అంతటితో ఆపు చేశాడు తను

తిరిగి ఈ రోజు – తనానాడు వేసిన ప్రశ్నే అతడు వేస్తోంటే, 'తన వరకూ వస్తే గానీ ' సామెత గుర్తొచ్చింది భరత్‌కు.

కానీ దెప్పడానికది సమయమూ, సందర్భమూ కాదని, పైగా అతడి మిత్రుడిగా అలా చేయడంలో ఔచిత్యం ఎంత మాత్రమూ లేదని గ్రహించిన భరత్ అన్నాడు – నిజమే! అప్పట్లో సంఘం ఏవో నియమాల నేర్పరిచింది కానీ వాటిని గుడ్డిగా ఆచరించాల్సిన అవసరం ఈనాడు లేదు – నిజంగా మనకు నచ్చని సమాజ నియమాలను ఆచరించ నక్కర్లేదనే గుండెధైర్యం ఉంటే "

ఊపిరి బరువుగా పీల్చి వదిలాడు కుమార్, మిత్రుడి మాటలకు భరత్ తిరిగి అన్నాడు – రూపను రేపటినుంచి అందరాడ వాళ్ళలా మామూలుగా ఉండమను ఎవరేమంటారో చూద్దాం

కుమార్ ఉలిక్కిపడ్డాడు

ఏం భయపడుతున్నావా? సంఘ నియమాల్లోని లోపాలను విమర్శించే ముందు అందుకనుగుణంగా ప్రవర్తించగలమో లేదో అనుమానం ఉండకూడదు

కుమార్ అన్నాడు – నువ్వు చెప్పింది బాగానే ఉంది కానీ రూప రేపటినుంచీ అందరిలా అలంకరించుకుంటే

'ఏమవుతుంది? మొగుడు పోయిన మూడో నాడే సింగారించుకుందని నలుగురూ అంటారు అంతేగా? అననీ! అందువల్ల పోయిందేముంది? అన్నాడు భరత్

నువ్వు చాలా థియరిటికల్‌గా ఆలోచిస్తున్నావు సమాజ నియమాలకు వ్యతిరేకంగా బ్రతకడానికి ఎంతో మనోస్థయిర్యం కావాలి అదిలేనినాడు, ఉన్న మానసిక శాంతి కూడా పోతుంది – సమాజానికి వ్యతిరేకంగా నడిస్తే అన్నాడు కుమార్

మిత్రుడి మాటలకు భరత్‌కు కోపం రాకపోగా నవ్వువచ్చింది ఒక దురాచారం నీకు నచ్చలేదని నోరునొప్పి పుట్టేలా వాదించగలవు కానీ సమాజం ఆమోదించని ఏక విషయానికి వ్యతిరేకంగా పోరాడ గలిగే శక్తి నీకులేదు కానీ సమాజం మాత్రం రాత్రికి 'రాత్రే మారిపోవాలి!'

కడుపునిండినవాడు ఆకలి గురించి ఆలోచించడు అతడి కటువంటి పదమనేది ఒకటుందని కూడా తెలియదు కానీ కడుపుకాలిన వాడికి ఆకలంటే ఏమిటో తెలుస్తుంది అయినా తన ఆకలిని తీర్చుకోవడాని కతడు ప్రయత్నించనపుడు, అతడికా విషయం తెలిసి ఏం లాభం?

కుమార్ ఏమీ మాట్లాడలేదు

*   *   *

వారం రోజుల తర్వాత మిత్రుడింటికి వెళ్ళాడు భరత్, సాదరంగా ఆహ్వానించాడు కుమార్ సతీ సమేతంగా

వారం రోజులక్రితం అతడి మొహంలో వ్యక్తమైన దిగులు ఛాయలు మచ్చుకైనా అతడి మొహంలో లేవు తన సూచన నతడు ప్రయోగాత్మకంకాదని మొదట్లో తిరస్కరించినా, తరువాత ఆలోచించి ఉంటాడు అందుకే అతడి మొహంలో అంత వెలుగు కనిపిస్తోందని అనుకున్నాడు భరత్ కానీ ఆ ప్రస్తావన తిరిగి తెచ్చి అతడిలో వస్తోన్న మార్పును తిరోగమింపజేసే సాహసం లేక మౌనంగా ఉండిపోయాడు

భార్య ట్రేతో తెచ్చిన కాఫీ కప్పుల్లో ఒకదాన్ని మిత్రుడి కందిస్తూ అన్నాడు కుమార్ – నువ్వన్న విషయం ఆలోచించాను కానీ సమాజాన్నెదిరించే స్థైర్యం నాకు లేదనే నిర్ధారణ కొచ్చాను ఇహ ధాని బ్రతుకంతే! మాతోనే ఉంటుంది కాకపోతే అది సాధ్యమైనంత బాదపడకుండా ఉండేలా మాత్రం మసలుకుంటాను

అదొక్కటే నేను చేయగలిగింది ఈ విషయంలో

నా భార్యను అభినందించాలి అందరిలా కాకుండా, భర్తృ విహీన అయిన ఆడపడుచంటే ఎంతో ప్రేమ తనకు మేమిద్దరం ఇంత ప్రేమగా చూసుకోవడం రూపకు వేరే అదృష్టమేముంటుంది?

'ప్రేమగా చూసుకోవడమంటే, రోజూ రెండు పూటలా భోజనంపెట్టి, కనీసావసరాలు చూడడమేనా?' అనుకున్నాడు భరత్ కానీ ఆ మాటలతడి నోట్లోంచి బయటకు రాలేదు

మిత్రుడిచ్చిన కాఫీ చేదుగా తగిలిందతడి నోటికి

★ ★ ★

'ఏవండీ,

పరిచితమైన గొంతువిని ఎటో చూస్తున్నదల్లా తల ఇటు తిప్పింది రూప భరత్‌ను చూసి పవిట భుజాల నిండుగా కప్పుకొని తలదించుకొని కూర్చుంది

పలకరించడమైతే పలకరించాడు గానీ ఆమెతో ఏం మాట్లాడాలో, ఎలా ప్రారంభించాలో అర్థం కాలేదతడికి

ప్రతిరోజూ వాహ్యాళికి ఎక్కడికో ఒకచోటికి వెళ్లడం అలవాటైన భరత్, ఆ రోజు ఊరికి దూరంగా విసిరేసినట్టున్న శివాలయానికి చేరుకున్నాడు ఆ ఊళ్లో అతడిష్టపడే ప్రదేశాల్లో శివాలయం కూడా ఒకటి

పచ్చటి చెట్ల మధ్య కోనేటి కెదురుగా ఉన్న ఆ ఆలయపు ప్రాంగణంలోకి ప్రవేశిస్తేనే మనసెంతో ప్రశాంతంగా ఉంటుంది ఆలయం వెనుకవైపు ఉన్న చప్టామీద వెల్లకిలా పడుకొని ప్రపంచాన్ని మరచిపోవడమంటే ఎంతో ఇష్టం అతడికి ఆ రోజూ అదే ఉద్దేశ్యంతో అతడక్కడికి వచ్చాడు

కానీ అత డూహించని విధంగా రూప అక్కడ కూర్చొని శూన్యంలోకి చూస్తోంది రూపను పెళ్లిగాక ముందునుంచీ అతడు చూస్తున్నాడు పెద్ద అందగత్తె కాదు గానీ ఆమెనోసారి హఠాత్తుగా చూసినవారి నెవరినైనా తిరిగి మరోసారి తనవైపు తిప్పుకోగలిగిన ఆకర్షణ ఉండేదామెలో

కానీ ఇప్పుడు నల్లంచు తెల్లచీరలో, అసలే విశాలంగా ఉండే ఆమె నుదురు మరింత విశాలంగా కన్పించి, అంత ఆకర్షణీయమైన మొహమూ వెలవెల బోయినట్టనిపించిందతడి కాక్షణంలో

అతడు తన దగ్గరగా రావడం చూసి ముడుచుకుపోతూ లేచి నిలబడింది రూప

భరత్ కంగారుపడ్డాడు 'అహహ కూర్చోండి లేవకండి' అంటూ ఆమె కెదురుగా కొంచెం దూరంలో ఆ రాతి చప్టామీద కూర్చున్నాడు

లేచి నిలబడిందల్లా అతడన్న మాటల కప్రయత్నంగా అదే చప్టామీద ఓ మూల కూర్చుందామె గతంలో కుమార్‌తో అతడు వాదించినపుడు, ఆమె ఇంట్లోనే ఉంది అతణ్ని చూడగానే ఆమెకా విషయం గుర్తొచ్చి గుండె గుబ గుబలాడింది

అంతలోనే భరత్ అన్నాడు, నేనేం కొత్తవాణ్ని కాదుకదా? ఎందుకలా బెదిరిపోతారు?

ఇబ్బందిగా నవ్విందామె

మీరే మనుకోనంటే ఒక మాటడగాలని ఉంది అన్నాడు బరత్ ప్రశ్నార్థకంగా చూసిందామె

మేమా రోజు వాదించుకొన్న విషయాలు మీరు వినే ఉంటారు మీరూ అందరాడవాళ్లలా ఎందు-కలంకరించుకోరు?

ఆమెలో బెరుకుపోయింది, అతడంత సూటిగా విషయానికి రావడంతో మొన్న మీరు మా ఇంటి కొచ్చినపుడు మా అన్నయ్యేమన్నాడో మీకు గుర్తుండే ఉంటుంది అంది రూప

ఒక్క క్షణం అప్రతిభుడై - గుర్తుంది మీరలంక



రించుకుంటే తట్టుకునే మనోస్థైర్యం తనకు లేదన్నాడే తప్ప, మీకు లేదని అతడనలేదు కదా? అన్నాడు భరత్ తెలివిగా

బదులుగా నవ్వి అందామె –, అతడి పంచన నేను బ్రతుకుతున్నపుడు అతడికి లేని స్థైర్యం నాకుండేం లాభం?'

ఆమె మాటల్లోని లాజిక్‌కంటే అంతర్లీనంగా ఆమె మాటల్లో ఉన్న బావమే అతడికెక్కువ ఆనందం కలిగించింది

మెరిసేకళ్లతో ఆమె వైపు చూస్తూ అన్నాడు భరత్ – "అతడి విషయం వదిలేయండి అలా ఉండడం మీ కిష్టమే కదా?

వ్యక్తిగతంగా ఇష్టమే' కానీ రెండు పూటలా తిండిపెట్టి పోషిస్తున్నందుకు, సాంఘిక భద్రత కలగజేసినందుకు, సాధ్యమైనంతవరకు అతడి మనసు కష్టపెట్టకుండా ప్రవర్తించడం నా కనీస ధర్మం కదా? అంది రూప

మీ అభిప్రాయంతో పూర్తిగా, ఏకీభవించక పోయినా మీ మాటలకు విలువనిస్తాను కానీ ఆకర్షణీయంగా మీరలంకరిచుకోవడంవలన సహజపరంగా తాత్కాలికంగా అతడి కళాంతి కలిగినా – జీవితాంతమూ మిమ్మల్ని పోషించి, సాంఘిక భద్రత కలగజేయడానికి, అంటే పెళ్లి చేసుకునేందు కెవరైనా ముందు కొచ్చే అవకాశం ఉంది కదా? అన్నాడు భరత్

'పై పై మెరుగులు చూసి జీవితాంతమూ పోషించాలనే నిర్ణయానికొచ్చిన వ్యక్తి మనసు ఎంతకాలం స్థిరంగా ఉండగలదని మీ అభిప్రాయం?

ఆమె అంత లాజికల్‌గా మాట్లాడగలదని భరత్ ఎంత మాత్రమూ ఊహించలేదు

తిరిగి అంది రూప – కట్టూ బొట్టూ మీద నాకు మోజు లేదని నేను చెప్పను కానీ కేవలం కట్టూ, బొట్టూ చూసి పెళ్లి చేసుకునేందుకు ముందు కొచ్చే వ్యక్తి ప్రేమ శాశ్వతంగా ఉండదని మాత్రం చెప్పగలను ఆ మాత్రం దానికి నన్నాప్యాయంగా

# అందరూ కోరేది

చూసుకునే వారిని బాధపెట్టడం దేనికి?"

మెచ్చుకోలుగా ఆమెవైపు చూస్తూ అన్నాడు భరత్ – 'మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను అలాగే మీరు మెచ్చే పనొకటి చేసి మీచేత అబినందింప జేసుకోవాలని ఉంది నాకు.

రూప కను బొమలు ముడిపడ్డాయి

అప్పుడామె నుదుటి మీద కనుబొమల మధ్య నిలువుగా ఏర్పడిన చార ఆమె మొహాని కెంతో శోభను చేకూర్చింది

మీ రొప్పుకుంటే జీవితాంతమూ ప్రతిరోజూ నిద్రలేవగానే మీ మొహాన్న బొట్టు ఉంచాలని ఉంది నాకు అన్నాడు భరత్

ఉలిక్కి పడింది రూప

దరహాసంతో ఆమెవైపు చూస్తూ అన్నాడు భరత్ – ఆదర్శం కోసం లేదా మీమీద జాలితో నే నిందుకు సిద్ధంకాలేదు మిమ్మల్ని మనస్ఫూర్తిగా ఇష్టపడ్డాకే నేనీ నిర్ణయానికొచ్చాను మీ మనస్తత్వమేమిటో మనం ఇప్పుడు జరిపిన సంభాషణ ద్వారా అవగతమైంది నాకు

మీ కభ్యంతరంలేని పక్షంలో కుమార్‌నెలా ఒప్పించాలనే విషయం నా కొదిలేయండి

* * *

'రూపను చూస్తే గుండె మండిపోతోందిరా' అన్నాడు కుమార్

'విషయ మేమిటన్నట్టు చూశాడు భరత్

ఈ మధ్య దాని ధోరణి విపరీతంగా ఉంటోంది ఇక్కడకు తీసుకొచ్చిన కొత్తల్లో దాన్ని చూస్తే గుండె తరుక్కుపోయేది కానీ ఇప్పుడు దాని పద్ధతి చూస్తుంటే, త్వరలోనే నాకు తలవంపులు తెచ్చేలా ఉంది

పోనీ ఆ చేసే షోకులేవో చేసుకొని ఇంట్లోనే ఉంటే నేనంత బాధపడకపోయే వాణ్ణేమో? కానీ ప్రతిరోజూ సాయంత్రం విధిగా బయటకు వెళ్లి వస్తోంది ఓ రోజు సినిమాకు, మరో రోజు షికారుకు, మరో రోజు బజారుకు – ఇలా ఏదో విధంగా బయటకు వెళ్లడమంటే ఆసక్తి చూపిస్తోంది

తన గుణం మంచిదే' కానీ రోజులు బాగోలేవు కదా? ఏక్షణాన్నేం జరుగుతుందోనని భయంగా ఉంది' అన్నాడు కుమార్

మిత్రుడి మాటలు విని అతడి మనసులోని భావమర్థమై అన్నాడు భరత్ – అంటే టు బి ఫ్రాంక్ తనెవరితోనైనా వెళ్లిపోతుందని నీ బయమా?

తలదించుకున్నాడు కుమార్

[illegible] భుజం తడుతూ భరత్ – అటువంటి ప్రమాదం జరుగుతుందనే అనుమానం నీకుంటే ఆమెకో వరుణ్ణి వెదకొచ్చుకదా?

మిత్రుడి ప్రపోజల్ అతడి కానందం కలిగించినా, అతడు సూచించిన పరిష్కారం, ఆచరణలో అంత తేలిగ్గా సాధించదగ్గది కాదు కనుక అతణ్ణి తిరిగి నీరసం ఆవహించింది

అప్పుడన్నాడు భరత్ – నీకు నిజంగా ఆ ఉద్దేశ్యం ఉంటే అందుకు నువ్వు పెద్దగా కష్టపడనవసరం లేదు నీ కభ్యంతరంలేని పక్షంలో రూపను నేను పెళ్లి చేసుకుంటాను

కుమార్ మొహం కాంతితో వెలిగిపోయింది మిత్రుణ్ణి గాడాలింగనం చేసుకున్నాడు, తన ఆనందాన్ని మాటల్లో చెప్పలేక ఆ సమయంలో తన మిత్రుడి కులమూ, తన కులమూ ఒకటి కాదనే విషయం అతడికి స్ఫురించినా, దాన్నతడు లెక్క చేయదలచుకోలేదు

* * *

పెళ్లయ్యాక రూపతో అన్నాడు బరత్ – నీ భవిష్యత్తేమవుతుందోననే బయం అతడిలో కలగ జేయకపోతే మన పెళ్లి కింత సరళంగా, త్వరగా ఒప్పుకొని ఉండేవాడు కాదు కుమార్ డైరెక్ట్‌గా నేనతడితో, 'నీ చెల్లెల్ని పెళ్లి చేసుకుంటానంటే ఒప్పుకునేస్థైర్యం అతడికుందని నేననుకోను

అందుకే నీ ప్రవర్తనలో వచ్చిన మార్పు ద్వారా నీ భవిష్యత్తేమవుతుందోననే భయం అతడికి కలిగేలా ప్రవర్తించమన్నాను చెల్లె లెవరితోనో లేచి పోవడంకంటే ఒకవ్యక్తికి – అతడు తన కులంవాడు కాకపోయినా – చట్టపరంగా భార్య అయితేనే మంచిదని అతడి కనిపించడంవల్లనే మన పెళ్లి కొప్పుకున్నాడు అందుకే తనం తటతనే అతడా ప్రస్తావన తెచ్చేలా ప్రవర్తించమని నీ కు సలహా ఇచ్చాను

కుమార్ పుట్టుక రీత్యా మనతరంవాడే అయినా, ప్రవర్తన, ఆలోచనా విదానం దృష్ట్యా వెనుకటితర్గం ప్రతినిధి అటువంటి వాళ్లకు ప్రతిదీ తమవరకూ వస్తేగానీ, సవ్యంగా ఎలా ప్రవర్తించాలో తెలియదు

సమాజంలోని దురాచారులు సమసిపోవాలని అందరూ కోరుకుంటారు సమాజంలో మార్పు రావాలనుకొన్నవాడు సమాజమేమన్నా పట్టించుకో కూడదు అలా పట్టించుకునే వాడది కోర్తుకో కూడదు '

ఆరాధనా పూర్వకంగా భర్త వైపు చూసింది రూప □

